క్లుప్తంగా

సీసీఐని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మల

ఇల్లెందు: పత్తి రైతులు సీసీఐ ద్వారా లబ్ధి పొందాలని ఇల్లెందు ప్రథమ శ్రేణి మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మల అన్నారు. బుధవారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల మొదటి వారంలో సీసీఐ ప్రారంభం అవుతుందన్నారు. ప్రస్తుతం పత్తి క్వింటా రూ.7,020 అన్ని చెప్పారు. కారేపల్లి మండలం అప్పాయిగూడెం శ్రీ లక్ష్మీప్రియ కొటెక్స్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ప్రతినిధి అందుబాటులో ఉంటారని పత్తిని అక్కడ విక్రయించుకోవాలని పేర్కొన్నారు.

సీతారాంపట్నం సేవియర్స్‌కు అవార్డు


సేవియర్స్ యూత్ సభ్యులు


పాల్వంచ: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి బెస్ట్ యూత్–2023 అవార్డుకు పాల్వంచ పట్టణంలోని సీతారాంపట్నం సేవియర్స్ యూత్ ఎంపికైంది. ఈ అవార్డును ఈనెల 15న ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగే ఎస్‌ఆర్‌ఎఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో అందజేయనున్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా యువతని చైతన్య పరుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి, యువతకు ఉపాధి కల్పించడంతో సహకారం అందిస్తుండటం పట్ల అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేశ్, యూత్ నిర్వాహకులు నామా నవీన్ తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రభాకర్‌రావు

పాల్వంచ: ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జూరాలలో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీల్లో కేటీపీఎస్ 5, 6 దశల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. క్యారమ్స్‌లో ప్రథమ, చెస్‌లో ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీఈ కార్యాలయంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు క్రీడాకారులు బి.చంద్రశేఖర్, టి.సత్యం, ప్రభాకర్, సాగర్, దేవేందర్‌లను సన్మానించారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి


సుభాష్‌నగర్‌లో వాల్‌పోస్టర్ల తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: ఎన్నికల నియమావళిని విధిగా అమలు చేయాలని ఎంపీడీఓ బాలరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్, బాలాజీనగర్, ఇందిరానగర్ గ్రామపంచాయతీలలో బుధవారం ఆయన పర్యటించి ఎన్నికల నియమావళి అమలును పరిశీలించారు. పలు వీధుల్లో రాజకీయ పక్షాల వాల్ పోస్టర్లను తొలగించే ప్రక్రియను పరిశీలించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రజినీకాంత్, నీలిమ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పగటిపూటే విద్యుత్ సరఫరా చేయాలి


కోయగూడెం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు

టేకులపల్లి: ఉదయమే పూర్తిస్థాయిలో నిరాటంకంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని రావులపాడు, ఇప్పలతండా, బావోజీతండా, మద్రాస్‌తండా, భట్టుతండా, గంగాపురం గ్రామాలకు చెందిన రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఈ గ్రామాలకు చెందిన పలువురు రైతులు కోయగూడెం సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. స్పందించిన ఏఈ కన్నయ్య మాట్లాడుతూ.. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డు నిర్మించేదెన్నడు?

- ప్రతిఏటా సెస్ రూపంలో రూ.2 కోట్లకు పైగా ఆదాయం
- 10 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు
- అయినా ప్రైవేట్ స్థలంలోనే పత్తి కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


ప్రైవేట్ స్థలంలో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

జూలూరుపాడు: పుడమి తల్లిని నమ్ముకొని ఆరుగాలం శ్రమించే వారు రైతులు కాగా, రైతులు పండించిన పంట మీద ఆధారపడి బతుకు జీవనం సాగించే హమాలీలకు జూలూరుపాడు పత్తి సబ్ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా తాత్కాలిక పత్తి మార్కెట్ యార్డును జూలూరుపాడులో ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపడుతున్నారు. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పత్తి క్రయ, విక్రయాల ద్వారా ప్రతి ఏటా సెస్ రూపంలో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ ప్రైవేట్ స్థలంలోనే పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. ఈ మార్కెట్‌లో రోజుకు సుమారు రూ.2.50 కోట్ల పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా, వ్యవసాయ మార్కెట్ కమిటీకి రోజుకు రూ.2.50 లక్షల ఆదాయం వస్తుంది. ఐదేళ్ల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు మార్కెట్ యార్డుకు 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. కానీ శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వీడడం లేదు. దీంతో పత్తి సబ్ మార్కెట్‌కు పత్తి తీసుకొచ్చిన రైతులు, హమాలీలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాలకు చెందిన రైతులు జూలూరుపాడు మార్కెట్ యార్డులో పత్తిని అమ్ముకునేందుకు వస్తుంటారు. రోజుకు 2 వేల క్వింటాళ్ల నుంచి 2.5 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరుగుతుంటాయి. ప్రైవేట్ స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వసతుల మధ్య సబ్ మార్కెట్ యార్డు నిర్వహణ కొనసాగుతోంది. వర్షం వస్తే మార్కెట్‌లో పత్తి తడవకుండా కనీసం షెడ్లు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. రైతులకు, యార్డులో పని చేసే హమాలీలకు కనీసం తాగడానికి నీళ్లు, సేద తీరేందుకు నీడ వంటి సౌకర్యాలు లేవు. జూలూరుపాడులో ఒంటిగుడిసె క్రాస్ రోడ్డు వద్ద శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. జిల్లాల పునర్విభజన తరువాత జూలూరుపాడు మండలం కొత్తగూడెం జిల్లాలోకి వచ్చింది, కానీ ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోనే కొనసాగుతోంది. కానీ మార్కెట్ కమిటీ లేదు. మరో రెండు వారాల్లో పత్తి తీతలు ప్రారంభం కానుండటంతో పత్తి కొనుగోళ్లు కూడా ప్రారంభించే అవకాశం ఉంది. ప్రభుత్వ స్థలంలో మార్కెట్ యార్డు నిర్మాణానికి ఏర్పాట్లు కూడా జరగడం లేదు. ఇప్పటికైనా శాశ్వత మార్కెట్ నిర్మాణానికి అధికారులు, పాలకులు దృష్టి సారించాలని రైతులు, హమాలీలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీమ్‌ను వివరణ కోరగా.. జూలూరుపాడు ప్రత్యేక మార్కెట్ యార్డు కోసం ప్రతిపాదించాం. కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

శాశ్వత మార్కెట్ నిర్మించాలి



20 ఏళ్లుగా తాత్కలిక మార్కెట్ యార్డులో పత్తి అమ్ముకునేందుకు వస్తున్నాం. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. శాశ్వత మార్కెట్ యార్డును నిర్మించాలి. ఈ ఏడాది 10 ఎకరాల పత్తి సాగు చేశాం. ఈ నెల చివరి నుంచి పత్తి తీతలు ప్రారంభం అవుతాయి.

– సాయిల కృష్ణయ్య, రైతు జూలూరుపాడు

వర్షం వస్తే పత్తి తడిసిపోతోంది



ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా మార్కెట్‌కు తెచ్చిన పత్తి తడిసిపోతోంది. మార్కెట్‌లో షెడ్లు, ఎలాంటి వసతులు లేవు. తాగడానికి నీళ్లు, ఎండ నుంచి సేద తీరేందుకు నిల్వ నీడ లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. శాశ్వత మార్కెట్ నిర్మాణం కోసం అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బానోత్ వాచ్యా, రైతు సురారం

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం



ప్రభుత్వ స్థలంలో మార్కెట్ యార్డు నిర్మించాలి. ఏళ్లగా మార్కెట్ యార్డు నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. మరో రెండు, మూడు వారాల్లో పంట చేతికి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం శాశ్వత మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేపట్టాలి.

– యల్లంకి వెంకటేశ్వర్లు, రైతు, జూలూరుపాడు

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ


స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి కాశయ్య, తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందు: ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను నియోజకవర్గ ఎన్నికల అధికారి కాశయ్య తనిఖీ చేశారు. బుధవారం జేకే ఏరియాలోని సింగరేణి స్కూల్‌లో బాక్సులు భద్రపరిచే గదులను పరిశీలించారు. అంతకు ముందు ఎన్నికల నియమావళి పాటించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కలెక్టర్ నియమించగా వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మోడల్ కోడ్ అమలులో ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు విధిగా నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సరిహద్దుల్లో చెక్ పోస్టులు నియమించారని, వాటిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల అధికారి వెంట స్థానిక తహసీల్దార్ కె.రవికుమార్ ఉన్నారు.

చెక్ పోస్టులలో తనిఖీలు...

ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం రాత్రి లలితాపురం చెక్ పోస్టులో సుమారు రూ.1.50 లక్షలు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఆధారాలు చూపటంతో రిలీజ్ చేశారు. రూ.50 వేలకు పైగా తీసుకెళ్లాలంటే అధికారులకు వివరాలు తెలిజేయాలని ఇల్లెందు సీఐ టి, కరుణాకర్ తెలిపారు. నిషేధిత వస్తువులు ఏది తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం


ఇల్లెందురూరల్: చల్లసముద్రంలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఆయన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. వాటికి సంబంధించిన బ్రోచర్లను ప్రతి ఇంట్లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలందరూ అధికారులకు దరఖాస్తు చేసుకునే వారని, అర్హులను కూడా అధికారులే ఎంపిక చేసేవారని నేడు అర్హుల ఎంపిక ఎలా జరుగుతుందో ప్రజలే గమనించాలని సూచించారు. దళితబంధు పేరుతో రెండు నెలలుగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఏం చేశారో ప్రజలే ప్రశ్నించాలని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.2,500, సాగులో ఉన్న రైతులందరికీ రూ.15వేలు పెట్టుబడి సాయం, కూలీలకు రూ.12వేలు ఆర్థిక చేయూత, రూ.500లకే వంట గ్యాస్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునేందుకు వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సర్పంచ్‌లు తాటి చుక్కమ్మ, పాయం స్వాతి, పాయం లలిత, కల్తి పద్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్..

చుంచుపల్లి: రుద్రంపూర్ పంచాయతీలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, సీఎం కేసీఆర్ కేవలం హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో పెట్టింది లేదని ఈ తొమ్మిదిన్నర ఏళ్లలో తెలంగాణ ప్రజలకు అర్థమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆకునూరి కనకరాజు, కలకోటి ఐలయ్య, రాజు, నిరంజన్ రాజ్యలక్ష్మి, సుప్రియ రాఘవి, కంజర్ల రాము, దుర్గరాశి సతీష్, ఖలీల్ పాల్గొన్నారు.

సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తేవాలి


విద్యార్థినిని అభినందిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

కొత్తగూడెంటౌన్: అక్టోబర్ 1న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్టేట్ మీట్ చాంపియన్‌షిప్‌లో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభను చాటారు. ఈ మేరకు బుధవారం ఆయా విద్యార్థినులు.. ఏ.వందన, ఇందు, సింధులను జీఎం ఎడ్యుకేషన్ ఎస్.వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిస్కస్ త్రోలో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో బీకాం విద్యార్థిని వందన విజయం సాధించిందని, ఇందు 3000 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగుత పందెంలో ద్వితీయ స్థానం, సింధు 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, మెడ్లీ రిలేలో మొదటి స్థానంలో రాణించడం గొప్ప విషయం అన్నారు. త్వరలో వరంగల్‌లో జరగనున్న జాతీయస్థాయిలో చాంపియన్ షిప్‌కి ఎంపిక కావడం పట్ల ఆనందంగా ఉందని, మరింతగా క్రీడల్లో రాణించి సింగరేణి సంస్థకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.నికోలస్, ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, వ్యాయామ అధ్యాపకురాలు డాక్టర్ సావిత్రి ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, వారి సంక్షేమంలో భాగంగా 2023–24 విద్యాసంవత్సరం గానూ ఉద్యోగుల పిల్లలకు నీట్/ఎంసెట్/ఏఐఐఎంఎస్/బిట్స్ ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి సంబంధిత విద్యా సంస్థలో అడ్మిషన్ పొందిన వారికి సింగరేణి సంస్థ ప్రతీ ఏటా మెరిట్ స్కాలర్ షిప్ సదుపాయం కల్పిస్తుందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మెరిట్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, అర్హుతతో పాటు ర్యాంక్ కార్డు, అలాట్‌మెంట్ ఆర్డర్, అడ్మిషన్ కార్డు, ఫీజు చెల్లించిన రశీదు జతపర్చాలని కోరారు.

డిస్మిస్ ఉద్యోగులకు అవకాశం..

సింగరేణిలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన సింగరేణి ఉద్యోగులకు సంస్థ అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2019 జనవరి నుంచి 2022 డిసెంబర్ వరకు విధులకు గైర్హాజరైన డిస్మిస్ మాజీ ఉద్యోగులకు నిబంధనలు ప్రకారం తిరిగి ఉద్యోగ నియామకం కల్పించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు హైపవర్ కమిటీచే నిర్వహించే రివ్యూ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను అడ్డుకోండి


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ క్రాంతి

టేకులపల్లి: సమాజంలో బాల్య వివాహాలు అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని మై చాయిసెస్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జే.క్రాంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాత్రి కొప్పురాయి గ్రామంలో ఫౌండేషన్ సహకారంతో సేఫ్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లల సంరక్షణ, గృహహింస, చిన్నారుల విక్రయాలు, రవాణా, బాలికల గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, బాలికలు, యువతులు, మహిళలపై దాడులు, అక్రమ రవాణా సమాచారం ఉంటే వెంటనే 1800 2129131, 1800 4198588 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత మంగమ్మ, మేడిపల్లి సింధు, రాజా రాఘవేంద్రనాయుడు, రమేష్, స్వర్ణ, నాగమణి, రవి, నాగస్వరూప గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



మాట్లాడుతున్న నిరంజన్‌రావు

కొత్తగూడెంఅర్బన్: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం జరిగింది. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. తొలుత తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు చైల్డ్ మ్యారేజ్ ప్రతిజ్ఞను విద్యార్థుల చేత చదివించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని, ఏ చిన్న సమస్య ఎదురైనా జీవితంలో సవాల్‌గా తీసుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆడబిడ్డలపై ఉండే వివక్షను, హింసను, బాల్యవివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. బాలికలను విద్యావంతులను చేసి వాళ్ల అభ్యున్నతి కొరకు పాటుపడాల్సిన బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో తల్లిదండ్రులకు, పాఠశాలలో ఉపాధ్యాయులకు సమస్యలను చెప్పుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను గురించి బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం నీరజ, న్యాయవాదులు రాజమల్లు, జి.సునంద, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, జి.నాగ స్రవంతి, మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, రమాదేవి, చందర్‌రావు, రమేశ్ ఉషారాణి, పారా లీగల్ వలంటీర్స్ బి.రాజమణి, ఇమామ్ పాల్గొన్నారు.

డీటీ, జూనియర్ అసిస్టెంట్ బదిలీ

పాల్వంచరూరల్: పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న వినయ్ శీలాశ్రీరాం జూన్ 20న పాల్వంచకు డీటీగా వచ్చారు. తాజాగా బుధవారం చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం డీటీగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చుంచుపల్లి డీటీ తిరుమల పాల్వంచకు బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యూసుఫ్‌అలీ పదోన్నతిపై వరంగల్ జిల్లా నర్సంపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లినట్లు తహసీల్దార్ నాగరాజు బుధవారం తెలిపారు.

పేద కుటుంబానికి వితరణ

టేకులపల్లి: బేతంపూడి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గాడిపెల్లి ఉపేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బూరుగడ్డ వీరప్రసాద్ బుధవారం మృతుడి తల్లిదండ్రులు నర్సయ్య, సత్తెమ్మలకు క్వింటా బియ్యం, పలువురు వద్ద సేకరించిన రూ.11వేల నగదును అందజేసి మానవత్వం చాటుకున్నాడు.

వైద్యశిబిరానికి స్పందన

సుజాతనగర్: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో చిమ్నా తండా గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. నీరసంగా ఉన్న రోగులకు ఓఆర్‌ఎస్, బీకాంప్లెక్స్ మందులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బదిలీ

జూలూరుపాడు: ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు పరిధి జూలూరుపాడు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత చంద్రుగొండకు, పాపకొల్లు సూపర్‌వైజర్ నాగమణి జూలూరుపాడుకు, పోకలగూడెం సూపర్‌వైజర్ శంకుతల పాపకొల్లుకు బదిలీ అయ్యారు. వీరు మంగళవారం రిలీవ్ అయినట్లు సీడీపీఓ నిర్మల జ్యోతి బుధవారం తెలిపారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు స్థానచలనం కల్పించినట్లు తెలిపారు.

సమ్మె విరమణ

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన నిరవధిక సమ్మెకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్లు ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం విద్య, వైద్య శాఖల అధికారులకు సమ్మె విరమణ లేఖలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నబీ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు చెప్పారు. హామీలు సకాలంలో అమలు చేయని పక్షంలో మరోసారి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమలో సుల్తానా, కుమారి, ఉమాదేవి, మల్లేశ్వరి, విజయలక్ష్మి, లత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

అటవీ రక్షణపై దృష్టి సారించండి


అటవీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

జూలూరుపాడు: అటవీ, వన్యప్రాణుల రక్షణపై దృష్టి సారించాలని కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం ఎఫ్‌డీఓగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఆర్‌ఓ, అటవీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్లాంటేషన్, నర్సరీలు, అటవీ అభివృద్ధి పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అటవీ, వన్యప్రాణుల రక్షణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలపై అటవీ సిబ్బందికి తగు సూచనలు చేశారు. అటవీ రక్షణపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని, అడవులు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని అటవీ సిబ్బందిని ఎఫ్‌డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్‌ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్లు రేఖ, భూక్యా నరసింహారావు, రవి, డి.కిషన్, చింతా వెంకటేశ్వర్లు, రహీం, పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం


విగ్రహానికి ముసుగు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

చుంచుపల్లి: శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామాలు, పట్టణాల్లో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది తొలగిస్తున్నారు. గోడలపై ఉన్న రాతలను చెరిపేస్తున్నారు. కూడళ్లలో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో బుధవారం వరకు 2 వేలకు పైగా ప్రచార ఫ్లెక్సీలను తొలగించారు. ప్రధాన పక్కన రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌ను తొలగించారు. గ్రామాల్లో పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలను ప్రజాప్రతినిధులు కాకుండా రెవెన్యూ అధికారులే అందజేస్తున్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినా మంగళవారం కిన్నెరసానిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగు వేయలేదు. ఎంపీడీఓ కార్యాలయంలో వేసిన ప్రచార పోస్టర్లను తొలగించలేదు. ఈ మేరకు 'కోడ్ అమలుపై నిర్లక్ష్యం' అని బుధవారం సాక్షి దిన పత్రికలో వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎన్‌టీఆర్ విగ్రహానికి బుధవారం ముసుగు వేశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రచార పోస్టర్లను తొలగించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం..

పాల్వంచ: ప్రశ్నించే గొంతులకు కాపాడుకోవాలని, ఎన్‌ఐఏ దాడులను ఖండిస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, టీజేఎస్ జిల్లా కన్వీనర్ బరగడి దేవదానం, న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. ప్రశ్నించే గొంతులైన జర్నలిస్టులు, న్యాయవాదులను కాపాడుకోవాలని ఎన్‌ఐఏ దాడులను నిలిపివేయాలని కోరుతూ బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై, న్యాయవాదులపై దాడులు చేస్తూ ఉపా, పీడీ యాక్ట్ కేసులు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో కుంజ కృష్ణ, వీరమల్ల, ఉమ, మంకెన వెంకటేశ్వర్లు, వైఎస్ రెడ్డి, బర్ల రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి బాలికలే వెన్నుముక


మాట్లాడుతున్న విజేత

పాల్వంచరూరల్: బాలికలు సమాజానికి వెన్నుముక అని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి వి.విజేత అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూర్బాగాంధీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాలికలు విద్యలో ప్రతిభ చూపాలన్నారు. బాలికలు ఎల్లప్పుడూ ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డీహెచ్ ఈడబ్ల్యూ మహిళా సాధికారిత కేంద్రం నిర్వాహకురాలు సంతోషరూప మాట్లాడారు. పిల్లలందరికీ తర్వలో సెల్ఫ్ డిఫెన్స్ స్కిల్స్ డెవలప్‌మెంట్ శిక్షణ అందిస్తామన్నారు. 1098, 181, 100, టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కనకదుర్గ, డీసీపీఓ హరికుమారి, సఖి నిర్వాహకురాలు శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.